RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

అనకాపల్లి సంపుటి: 2 సంచిక: 157 బుధవారం 6-11-2024 ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ పేజీలు : 4 వెల : 3.00





## కొండ నీరు గెడ్డకు వెళ్లే దారేదీ!

### - సర్వే రిపోర్ట్‌తో గోల్ మాల్ ఇళ్ల నిర్మాణంతో ఇరకాటం

పరవాడ పెన్ సత్తా నవంబరు 5: ఇళ్ల నిర్మాణం కోసం కొండల నుంచి నీరు గెడ్డలకు ప్రవహించే దారిని మూసేశారు. కొండ గెడ్డ నుంచి ప్రవహించే నీరెళ్లే దారి అక్రమణలకు గురైంది. ఇది పరవాడ తహశీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోక పోవడం విమర్శలకు తావిస్తుంది. మూడు దశాబ్ధాల క్రితం పరవాడలో అనధికారిక లే అవుట్‌ను సర్వే నెంబర్‌లు 116, 117, 118 లలో రూపొందించారు. ఈ లే అవుట్ ను అనుకొని ఉన్న కొండగెడ్డలు, రహదార్లును అక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అడ్డుకోవల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో ఇప్పుడు ఏకంగా కొండగెడ్డ నీరెళ్లే దారి లేకుండా పోయింది. సర్వేనెంబర్ 117/3లో 14సెంట్లు రహదారిగా నమోద్కె ఉంది. పరవాడ అసకపల్లి ఆర్అండ్‌బి రహదారిని ఆనుకొని ఈ భూమి ఉంది. అర్అండ్‌బి రహదారికి అవల ఉన్న సర్వే నెంబర్ 11 కొండ నుంచి ప్రవహించే వర్షం నీరు ఆర్అండ్‌బి రహదారిలో నిర్మించిన కల్వర్టు ద్వారా సర్వేనెంబర్ 117/3, సర్వేనెంబర్ 118/గుండా ప్రవహించి కొండ గెడ్డలకు చేరుతుంది. అయితే ఈ రహదారులు ఆక్రమణలకు గురి కావడంతో నీరెళ్లే దారి లేకుండా పోయింది. లింక్ డాక్యుమెంట్లలో ఉన్న సర్వేనెంబర్ 117 ను ప్రవేటు సర్వేయర్ ద్వారా లేదని పొందిన సర్టిఫికేట్ సహాయంతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. నిజానికి గతంలో ఇక్కడ నిర్మాణాలను సచివాలయం సర్వేయర్ అడ్డుకున్నారు. అయితే ఇప్పుడు సచివాలయం సర్వేయర్‌తో పాటు మండల సర్వేయర్ మౌనం వహించడంతో ఇళ్లు షెడ్ల నిర్మాణం చకచకా సాగిపోతుంది. ఇంటికి రోడ్డు పేరుతో రెవెన్యూ రికార్డుల్లో రహదార్లుగా నమోద్కెన నీటి ప్రవాహానికి



వినియోగించే దార్లు పూడ్చి వేశారు. ఇప్పుడు కొండగెడ్డ నుంచి వస్తున్న నీరు వెళ్లే దారి మొత్తం పూడికి పోయింది. అనధికారిక లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు 150 అడుగుల రహదారిని విడిచి పెట్టాలి. లే అవుట్ వేసిన భూమిలో కొంతభాగం ఇనాం భూమి కావడంతో ప్రభుత్వ రహదార్లను సయితం చూపి 150 అడుగుల రహదారిగా లే అవుట్‌లో చూపారు. అయితే 150 అడుగుల రహదారిని విడిచి పెట్టకుండా ఆర్అండ్‌బి రహదారిని ఆనుకొని నిర్మాణాలు చేయడంతో ప్రభుత్వ రహదారులు కబ్జాలకు గురయ్యాయి. ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం సహజ వనరులు అయిన చెరువులతో పాటు రహదార్లను ఆక్రమించనా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారం పై జిల్లా కలెక్టర్‌కు పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రజా సంఘాలు సిద్దమవుతున్నాయి. అయితే పరవాడ రెవెన్యూ అధికారులు రహదారుల కబ్జా పై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## దీపం లబ్దిదారులకు ఇంటి వద్దే ఇ కె వై సీ

### - సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1967 - జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి

అనకాపల్లి పెన్ సత్తా నవంబరు 5: దీపం 2 పధకం లబ్దిదారులకు అవసరమైన ఇ కె వై సీ ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్ ల ద్వారా లబ్దిదారుని ఇంటివద్దే ఉచితంగా చేయించుటకు చర్యలు తీసుకున్నట్లు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులు అయిన పేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు (3) గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా అందజేస్తున్న దీపం 2 పధకాన్ని అక్టోబరు 31 నుంచి అనకాపల్లి జిల్లాలో అమలుచేస్తున్నట్లు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. ఈ పథకంలో ప్రజల సౌకర్యార్ధం మరి కొన్ని వెసులుబాట్లు కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం క్రింద మొదటసారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందగోరు లబ్ధిదారులు అక్టోబరు 29 తేది నుండి 2025 సంవత్సరం మార్చి 31 తేది వరకు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకున్న ఎడల, మొదటి విడత ఉచిత సిలిండర్ సరఫరా జరుగునని తెలియజేసారు. కావున లబ్దిదారులు ఈ అవకాశమును వినియోగించుకోవాలన్నారు. డెలివరీబాయ్ వినియోగదారుని ఇంటికి గ్యాస్ తెచ్చినప్పుడు ఖాళీ గ్యాస్ సిలిండర్ సిద్ధముగా ఉంచుకోవాలని, లబ్దిదారుడు ఈ పథకము క్రింద తీసుకున్న గ్యాస్ సిలిండర్ ఇతరులకు ఇవ్వరాదని, వారు మాత్రమే తమకు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి వినియోగదారుడు ఇంటి వద్దే "కేవైసీ"



ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్ ద్వారా జరుగునని, అందుకు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఈ దీపం-2 పథకం పై లబ్దిదారులు తమకేమైనా అసౌకర్యము లేదా, సూచనలు లేదా, ఆక్షేపణలు తమ సంబందిత వార్డ్ లేదా గ్రామ సచివాలయము యందు లేదా టోల్ ఫ్రీ నంబరు 1967 ఫోన్ చెసి తెలియజేస్తే సత్వర చర్యలు తీసుకోనబడునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆర్ధికంగా మేలు చేయుటకు ఉద్దేశించిన ఈ పధాకాన్ని లబ్దిదారులు వినియోగించుకొని ఎటువంటి అవకతవకలకు గాని, "బ్లాక్ మార్కెట్" కు తరలించడం గాని పాల్పడరాదని జిల్లా లోని లబ్దిదారులు అందరుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

## సచివాలయ సిబ్బందితో కుటుంబ సర్వే

### - ప్రతి ఇంటికీ జియో ట్యాగింగ్ తప్పనిసరి

అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా కుటుంబాల సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామ వలంటీర్ల ద్వారా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయగా, తాజాగా కూటమి ప్రభుత్వం ఏకంగా ఆయా ఇళ్లను జియో మ్యాపింగ్ చేయడంతో పాటు కుటుంబంలోని వారి వివరాలను కూడా సర్వే ఆధారంగా డేటా బేస్ నమోదు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. నవంబరు 31న దీపావళి రోజున జరిగిన సిఎం సమీక్షలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు మంగళవారం జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంటింటి సర్వే ఎప్పుడు ప్రారంభించాలి? ఎప్పటి లోగా పూర్తి చేయాలనే అంశాలు ఉత్తర్వుల్లో లేకపోయినప్పటికీ భవిష్యత్తులో సంక్షేమ పథకాల మంజూరు, తొలగింపుపై ఈ సర్వే ప్రభావం పడే



అవకాశాలు లేకపోలేదనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు, పిఎంఎవై 2.0 గృహాల మంజూరు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు అర్హులైన నిరుద్యోగుల జాబితాను ఎంపిక చేయడం, నిరుద్యోగ భృతికి అర్హులను గుర్తించడంతో పాటు పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా చేపట్టనున్న కుటుంబ సర్వే వల్ల కొంతమేర సంక్షేమ పథకాల లబ్ధిదారులు తగ్గే అవకాశం కూడా లేకపోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 2028 మార్చికి పోలవరం పూర్తి

### - సమీక్షలో ముఖ్యమంత్రి ఆదేశం

అమరావతి: పూర్తి నాణ్యతతో పోలవరం ప్రాజెక్టు పనులు 2028 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం (నేటి) నుండి నాలుగురోజుల పాటు పోలవరం ప్రాజెక్టు సాంకేతిక అంశాలపై మేథోమథన సదస్సు జరగనున్న నేపథ్యంలో అధికారులతో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద జరగనున్న ఈ మేథోమథనంలో కేంద్ర జలశక్తి శాఖ,సిడబ్ల్యుసి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులతో పాటు జియో టెక్నికల్ రంగంలో నిపుణులైన విదేశీ బృందం, ఢిల్లీ, చెన్నై, తిరుపతిలకు చెందిన ఐఐటి నిపుణులు పాల్గొననున్నారు. డయాఫ్రం వాల్, ఎర్త్ రాక్ ఫాల్ డ్యామ్‌లతో పాటు ప్రాజెక్టు నిర్మాణాలపై ఈ సదస్సులో చర్చ జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆ అంశాలపై తాజా సమీక్షలో దృష్టి సారించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం, డిజైన్లు, ప్రణాళికపైనా చర్చించారు. అనుమతులు, సాంకేతిక, ఆర్థిక, సమస్యలు, సవాళ్లపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సిఎం సుదీర్ఘంగా మాట్లాడారు. 2028 మార్చి



నాటికి పనులు పూర్తిచేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.. వీలైనంత త్వరగా ఎడమకాలువ పనులు పూర్తి చేయాలని, కుడికాలువ విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పునరావాసం, పునర్నిర్మాణం పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుతో పాటు అన్ని రకాల పనులూ సమాంతరంగా చేయాలని సూచించారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఉన్న కాలువ కట్టలను బలోపేతం చేసి నీటి తరలింపునకు సిద్ధం చేయాలని చెప్పారు.

## మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ కన్నుమూత...

### - 5 మార్లు ఎమ్మెల్యే పదవి... ఒక సారి మంత్రి పదవి - నిరాడంబరుడు, ప్రజానాయకుడు

చోడవరం పెన్ సత్తా నవంబర్5: మాజీ మంత్రి, 5 మార్లు ఏకధాటిగా ఒకే నియోజకవర్గము నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన రెడ్డి సత్యనారాయణ (99) కన్నుమూసారు. గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్న రెడ్డి సత్యనారాయణ మృతి చెందారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రెడ్డి సత్యనారాయణకు తెలుగుదేశం పార్టీ ఆవిరిభావంలో ఆ పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు సిద్ధాంతాలు, రాజకీయ పట్టుదల చూసి ఆ పార్టీలో చేరి 1983లో అసెంబ్లీ ఎన్నికల్లో మాడుగుల ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటినుండి తిరిగి వెనక్కి చూడకుండా 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో గెలుపొంది, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ మంత్రిగా పనిచేసి ఎందరో మన్ననలు పొంది ప్రజల హృదయాలకు దగ్గరయ్యారు. తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ గా పనిచ్టేసారు. ఈయన నిరాడంబరుడు. అధికార దర్పం చూపించలేని నాయకుడే కాకుండా ప్రజాధనంపై ఆకాంక్ష లేని నాయకుడు. ప్రజల హృదయాలను దోచుకున్నారే తప్పా ప్రజల సొమ్మును, ప్రభుత్వ సొమ్మును దోచుకోలేదు... దాచుకోలేదు. ఖండివరం నుండి మాడుగులకు అప్పట్లోనే రూ 20 కోట్లతో రోడ్డు వేయించి ఆ ప్రాంత ప్రజలకు మరింత చేరువయ్యారు. ఈయన ఆ తరం నాటి మనిషి కావడంతో ఆయన ఆలోచన విధానం కూడా హుందాగానే ఉండేది. అధికారంలో ఉన్నప్పుడు కూడా సైకిల్ మీద, రిక్షా లోను, ఆర్టీసీ బస్సులోనూ తిరిగిన నాయకుడు. ఆనాటి నాయకుల మనస్తత్వాలే వేరు.... ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే



నేతలు.... రెడ్డి సత్యం మాస్టారు సేవలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్.రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, బిజెపి రాష్ట్ర నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, చోడవరం సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, మాజీ జెడ్పిటిసి పివిజి కుమార్ తదితరులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## సీనియర్ నాయకులు రెడ్డి సత్యనారాయణ మరణం దిగ్భ్రాంతికరం

### - సీఎం రమేష్ - అందరం ముద్దుగా పిలుచుకునే సత్యం మాస్టారు మన మధ్య లేరు అనే వార్త తీవ్రంగా కలచివేసింది

అనకాపల్లి పెన్ సత్తా నవంబరు 5: జిల్లా చీడికాడ మండలం పెదగోగాడకి చెందిన మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర సీనియర్ నాయకులు రెడ్డి సత్యనారాయణ (మాస్టారు) మంగళవారం ఉదయం ఆయన స్వర్గస్తులయ్యారనే వార్త తీవ్రంగా కలిసి వేసిందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి సత్యనారాయణ ఒకే నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాయకులు అన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన 1983 నుండి 2004 వరకు 5 సార్లు ఎమ్మెల్యే గా, పశు సంవర్ధక మత్స్య పరిశ్రమ శాఖ మాత్యులు గా, రాష్ట్ర అంచనాలు కమీటి చైర్మన్ గా, టిటిడి బోర్డు సభ్యులు గా రెండు సార్లు, టిడిపి ఎల్పి రాష్ట్ర ఉపనాయికుడుగా అనేక సేవలందించిన గొప్ప నాయకులు అన్నారు. అనారోగ్య కారణాలతో స్వగ్రామం పెదగోగాడలో ఆయన తుదిశ్వాస విడిచారు అనే వార్త తెలిసి ఎంతో బాధించింది అని తెలిపారు. అనకాపల్లి ఎం.పీ కూటమి అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మాడుగుల నియోజకవర్గంలో ముందుగా మాస్టారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎలాంటి ఆడంబరాలకు పోకుండా నిరాడంబర జీవితాన్ని గడిపిన ప్రజల మనిషిగా, ఎక్కడికైనా కాలినడకన, సాధారణ బస్సుల్లోనే ప్రయాణించే ఆయన తీరు ఎందరికో ఆదర్శము



అన్నారు. నిరాడంబరత్వానికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అయిన మాస్టారు మాడుగుల నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు అని పేర్కొన్నారు. రాజకీయ నాయకులుగా కాకుండా గొప్ప మానవతావాదిగా ఆయన సమాజానికి చేసిన సేవలు అనిర్వచనీయం అని కొనియాడారు. ఈ బాధాకరమైన సమయంలో దేవుడు మనో ధైర్యాన్ని ఇవ్వాలని తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, రెడ్డి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.



## ఆశా కార్యకర్తల నిరసన....

### - 18న జిల్లాస్థాయిలో ధర్నా

చోడవరం పెన్ సత్తా నవంబర్5: మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. చోడవరం మండలంలో పనిచేస్తున్న 63 మంది ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి గవరవరం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు సంఘం జిల్లా అధ్యక్షురాలు బొద్దాన రామలక్ష్మి మాట్లాడుతూ.... ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయవాడలో ఆశా కార్యకర్తలు ఆందోళన జరిపితే రాష్ట్ర ప్రభుత్వ నాయకులు అధికారులు కొన్ని హామీలు ఇచ్చారని ఇచ్చినవి కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకొని వేతనం పెంచాలని, వ్రాయడానికి రికార్డ్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 62 కు పెంచాలని కోరారు. ఈనెల 18న సమస్యల పరిష్కారం కోసం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని, నిత్యం సేవలు అందిస్తున్న తమపై ప్రభుత్వం ఎందుకు చిన్న చూపు చూస్తుందో అర్థం కావడం లేదని ఆమె పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా కృతజ్ఞత కానుకుల పండుగ

చోడవరం పెన్ సత్తా నవంబర్5: స్థానిక అన్నవరం శివారు వెంకయ్యగారి పేట వద్ద ఉన్న జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో కృతజ్ఞత కానుకల పండుగ ఘనంగా నిర్వహించారు. పవిత్ర ప్రార్ధన కార్యక్రమామూలు, దేవుని గీతాలు ఆలపించారు. సంఘ కాపరి అబ్రహం పవిత్ర వ్యాకోపద్దేశ్యం చేశారు. అనంతరం చర్చి న్యాయ సలహాదారునిగా దేవరపల్లి నవ కుమార్ ని సంఘ కాపరి నియమించారు. అనంతరం సీనియర్ సంఘ విశ్వాసకులను సన్మానించారు.



## గోవాడలో మద్యం దుకాణంపై కలెక్టర్ కు ఫిర్యాదు

### - జన నివాసాల మధ్య మద్యం దుకాణం
### - మార్చకపోతే ఆందోళన చేస్తామని జనసేన నేత

చోడవరం పెన్ సత్తా నవంబర్5: మండలంలోని గోవాడ గ్రామంలో జననివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో ఆ గ్రామానికి చెందిన కొందరు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణం స్థలం మార్చకపోతే ఆందోళన చేస్తామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామ అప్పారావు తెలిపారు. గ్రామ సచివాల యంనకు, దేవాలయాలకు మధ్యలో మద్యం దుకాణం ఉందని దాని వలన ప్రజలు నానా ఇబ్బందులు పడుతు న్నారని ఇప్పటికైనా మార్చాలని ఆయన కోరారు. ఇప్పటికే ఫిర్యాదు చేసామని అయినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చేయడానికి సిద్ధపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

# జుత్తాడలో ఇసుక దందా.....

### - ముద్దుర్తిలో భక్తులను ఇబ్బంది పెట్టి ఇసుక వ్యాపారం
### - కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు - టిడిపి నేత ఆధ్వర్యంలో దర్జాగా వ్యాపారం



చోడవరం, నవంబర్5(ఆంధ్రప్రభ) మండలంలోని జుత్తాడ, ముద్దుర్తి గ్రామాల్లో ఇసుక దందా దర్జాగా జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇసుక ఫ్రీ అని చెబుతున్నా స్థానిక అధికారులు కొందరు కాసులకు కక్కుర్తి పడుతుండడంతో ఇసుక డాన్ గా చోడవరం ప్రాంతానికే పెరుగాంచిన టిడిపి మండల స్థాయి మాజీ నాయకుడు ఆధ్వర్యంలో దర్జాగా ఇసుక వ్యాపారం జరుగుతుంది. అధికారులకు తెలిసినా కొందరు కాసులకు కక్కుర్తి పడి తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. జుత్తాడ గ్రామం నుండి ట్రాక్టర్లు, లారీల్లో అనకాపల్లి, గాజువాక, విశాఖపట్నం ప్రాంతాలకు తరలి వెళ్తుంది. ముద్దుర్తి గ్రామంలో ఇసుక వ్యాపారం మరి దారుణంగా ఉంది. అతి ప్రసిద్ధి చెందిన శ్రీసంగమేశ్వర ఆలయం వద్ద త్రివేణి సంగమం ఉంది. మూడు నదులు కలిసే ప్రదేశం. ఎంతో పవిత్రమైన నదిలో కార్తీక మాసం పవిత్రమైన రోజుల్లో స్నానమాచరించడానికి భక్తులు వస్తున్నా ఇక్కడ ఇసుక వ్యాపారం పరిస్థితి చూసి కొందరు వెనక్కి వెళ్ళిపోతున్నారు. నదిలో ఇనుప పెనాలు వేసి ఇసుక తీసి వడ్డున వేసి ట్రాక్టర్లు, లారీలకు అమ్మకాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులు, మండల స్థాయిలో పనిచేసే అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని పలువురు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితం అని చెబుతున్నా క్షేత్రస్థాయిలో వేలకు వేలు పెట్టి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. నదుల్లో ఇసుక ఎక్కువగా తీస్తుండడం వలన ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ముద్దుర్తిలో గతంలో చాలా మంది చనిపోయారు. అయినా ఇసుక దందా ఆగలేదు. గోవాడ వంతెన ప్రమాద స్థాయిలో ఉంది. జుత్తాడ, గజపతినగరం గ్రామాల్లో ఇసుక ఎక్కువగా తీసివేయడం వలన వంతెన కింద ఉన్న రాతి స్తంభాలు కొన్ని పక్కకు పడిపోయాయి. అయినా ఇసుక దందా ఆగలేదు.... ఎవరు ఆపలేదు. మద్యం వ్యాపారములా నిత్యం జరుగుతుంది. కళ్ళ ముందు ఇసుక లారీలు వెళుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# నాగుల చవితి వేడుకల్లో దాడి కుటుంబం



అనకాపల్లి పెన్ సత్తా నవంబరు 5: నాగుల చవితి పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు కుటుంబ సమేతంగా స్థానిక డైట్ కళాశాల ఆవరణలో నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి స్వామివారి ఆశీర్వాదం పొందారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ వద్ద గల నాగమ్మ దేవత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవరపాలెం దిబ్బ వీధిలో గల నాగేంద్ర స్వామి ని దర్శించుకుని పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో ఈ దేవాలయాలు చాలా శక్తివంతమైనవని, అనేకమంది భక్తులు మంగళవారం, శుక్రవారం లో ఇక్కడికి వచ్చి పూజలు చేసి తమ కోరికలను తీర్చే దేవతామూర్తులుగా ఆరాధిస్తారని అన్నారు. ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా భక్తులందరూ ఆ నాగేంద్రుని పూజించి సకల ఐశ్వర్యాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగ దుర్గమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ బిశెట్టి తాతారావు, పొలిమేర శివ అప్పారావు, మద్దాల కృష్ణ, బొడ్డేడ రోషన్, పొలిమేర బాబ్జి, గొర్లి కుమార్, కొలమ శెట్టి బుజ్జి, ఆడారి రవికుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ గవర్నర్ ఎన్నిక నిబంధనలు ప్రకారం నిర్వహించాలి

### - వైస్ గవర్నర్ మధు డిమాండ్



చోడవరం పెన్ సత్తా నవంబర్5: వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్నికలు నిబంధనలు ప్రకారం నిర్వహించాలని క్లబ్బు సభ్యుల కోరిక మేరకు ఎన్నికలు ఏర్పాటుచేసి ప్రకటించాలని ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదని వాసవి క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ శ్రీనాధు వెంకట మాధవ (ఎస్.వి మధు) అన్నారు. జిల్లా గవర్నర్ పదవి కోసం ఇటీవల మోదకొండమ్మ ఆలయంలో నామినేషన్ పత్రాలు స్వీకరించగా తను, పసుమర్తి మల్లికార్జునరావు, కే.సోమరాజు, కే.పార్వతి అలియాస్ పూర్ణిమ నామినేషన్లు వేసామని, వారిలో సోమరాజు పోటీ నుండి విరమించుకున్నారని ఆ తర్వాత ఎన్నికల ప్రక్రియ అంతా గజిబిజిగా తయారు చేశారని పేర్కొన్నారు. జిల్లాలో వాసవి క్లబ్ సభ్యులు 4300 మంది ఉన్నారని, నిబంధనలు మేరకు గవర్నర్ ఎన్నికలు నిర్వహించాలని లేకుంటే వాసవి క్లబ్ నాయకులు, ప్రతినిధులు సహించరని అన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సభ్యుల మనోభావాలు దెబ్బతినేలా నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన కోరారు.



## కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఉంజల సేవా కార్యక్రమం

అనకాపల్లి పెన్ సత్తా నవంబరు 5: సర్వ కామదాంబ సమేత బోగలింగేశ్వర స్వామి కోవెలలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఉంజల సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బుద్ధ రమణాజీ సరోజినీ దంపతుల చేతుల మీదగా ఊంజల సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిరి స్పందన నూర్చాలయం బృందం చే భరతనాట్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు భీమేశ్వర రావు, వేణు, గోపి, చిన్ని, గణేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఏపీ స్పోర్ట్స్ పాలసీ పై సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం హర్షణీయం

పరవాడ పెన్ సత్తా నవంబరు 5: విశాఖపట్నం జిల్లా విలువిద్య సంఘ అధ్యక్షులు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యా సంస్థ అధినేత పి. సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ క్రీడా విధానం వలన విద్యా విధానంలో కూడా పెనుమార్పులు వస్తాయని ఆశిస్తూ, ఇలాంటి క్రీడా విధానం వలనే నాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఆయన సహాయ సహకారలతో ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ అకాడమీ కూడా మా విద్యా సంస్థ లో నెల కొల్పడం జరిగిందన్నారు. వాటి ప్రతి ఫలంతో నేడు స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో క్రీడా ప్రతిభ చూపడం జరుగుతుందని తెలిపారు. అకాడమీ లకు నిధులు లేమి ఉన్న మా సొంత వ్యయప్రయాసలతో నెట్టు కోస్తున్న సమయంలో మళ్ళీ ఆటలకు పునర్జీవం పోస్తూ ఈ క్రీడవిధానం పై సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా క్రీడా విధానమునకు రూపకల్పనకు కృషిచేసిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి ఎన్. లోకేష్ బాబు, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, ఉన్నతాధికారులకు ధన్యవాదములు తెలిపారు.



## రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అనకాపల్లి విద్యార్థులకు ద్వితీయ స్థానం

అనకాపల్లి పెన్ సత్తా నవంబరు 5: కోనసీమ అంబేద్కర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు అండర్ 14 విభాగంలో జి హేమంత్, అండర్ 17 విభాగంలో బి పోలి విశాల్ సూర్య పోటీలో పాల్గొని ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు దాడి జైవీర్ వీరిని అభినందించి, సత్కరించారు. బ్యాట్మెంటన్ లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలి అని, వారికి కావలసిన సహాయ సహకారాలు అన్నీ కూడా తాను సొంత ఖర్చులతో అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. క్రీడాకారులతో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పి ఎస్ కే నాయుడు, చోడవరం కార్యదర్శి బిఎస్సి నాయుడు, కోచ్ కొణతాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షపోతేనే భారత్ శక్తివంతం

### - తెలంగాణలో కులగణన దేశానికే ఆదర్శం - రాహుల్ గాంధీ

హైదరాబాద్: దేశంలో కుల వివక్షతను నిర్మూలిస్తేనే ఆర్థికంగా భారతదేశం శక్తివంతమవుతుందని ఏఐసిసి అగ్రనేత, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక ఎదుగుదలకు అంటరానితనమే పెద్ద ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ కేంద్రంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కులగణన సదస్సులో రాహుల్‌గాంధీ మాట్లాడారు. అన్ని వ్యవస్థల్లోనూ కులవ్యవస్థ పాతుకుపోయిందనీ, దానికి న్యాయ, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు కూడా అతీతం కాదని స్పష్టం చేశారు. ఈ నిజాలు ప్రధాని మోడీకి తెలిసినా బయటకు రానివ్వకుండా దాచిపెడుతున్నారని విమర్శించారు. అసమానతల భారతంలో ప్రజలు ఎలా సంతోషంగా ఉంటారని ప్రశ్నించారు. కులగణనతో ఎవరి వద్ద ఎంత ఆస్తి ఉందో తేలుతుందనీ, ఆ సంపద అందరికీ సమానంగా పంపిణీ జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న కులగణన కార్యక్రమం దేశానికి రోల్ మోడల్‌గా కాబోతున్నదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాతీయస్థాయిలో కులగణన చేపడతామని హామీ ఇచ్చారు. అంతకు ముందు మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. 250 మంది ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా?' అని ప్రశ్నించారు. కులగణన ద్వారా దళితులు, ఒబిసిలు, ఆదివాసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుందన్నారు. ఇది కులగణన కాదనీ, ప్రభుత్వాలు ఏ విధంగా ముందుకుపోవాలో మార్గనిర్దేశం చేస్తాయన్నారు. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాతినిధ్యం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, మేధావులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు

## - కుటుంబ సమేతంగా నేతల పూజలు





చోడవరం పెన్ సత్తా నవంబర్5: చోడవరం పట్టణంలోని, మండలంలోని అన్ని గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సాంప్రదాయమైన దుస్తులు ధరించి నాగేంద్రుని పుట్టల వద్దకు వెళ్లి పూజలు జరిపి పాలు పోసి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు చోడవరంలోని, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వంటర్లపాలెం గ్రామంలోని కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రునికి పూజలు జరిపి పాలు పోశారు.

# ఇది కూటమి ప్రభుత్వమిచ్చిన 'కరెంట్ షాక్'

## - 'ట్రూఅప్' భారాన్ని ఖండించిన పిసిసి చీఫ్ షర్మిల



అమరావతి: విద్యుత్ సర్దుబాటు ఛార్జీల విషయంలో గత ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సిందిపోయి, కూటమి ప్రభుత్వం ఆ పాప పరిహారాన్ని ప్రజల నెత్తిన మోపుతోందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. రూ.18 వేల కోట్లు సర్దుబాటు ఛార్జీలు వినియోగదారుల నెత్తిన వేయడం కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న భారీ 'కరెంట్ షాక్' అని విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు ప్రజలను ఎలా బాధ్యులను చేస్తారని ప్రశ్నించారు. ఐదేళ్లలో వైసిపి రూ.35 వేల కోట్లు భారం వేస్తే, ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.18 వేల కోట్ల భారం వేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి సర్దుబాటు ఛార్జీల భారం వినియోగదారులపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా గురువారం నుంచి మూడు రోజులపాటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు.

# ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థిగా విజయగౌరి



విశాఖ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి పోటీ చేయనున్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ అధ్యక్షతన విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ప్రతినిధుల సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా ప్రకటించింది. యుటిఎఫ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, అధ్యాపక తదితర సంఘాలు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపర్చాయి. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన విజయగౌరి ఉద్యమ నేతగా గుర్తింపు పొందారు. అదే జిల్లాలోని రామభద్రపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. 1980వ దశకంలో ఎస్ఎఫ్ఐ నుంచి ప్రస్థానం ప్రారంభించి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. అంతకుముందు రాష్ట్ర సహాధ్యక్షురాలిగా పనిచేశారు.

# 'సరస్వతి' భూములపై విచారణ చేపడతాం

## - దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చ - ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా): ప్రజలకు, ప్రభుత్వానికి చెందిన భూములను లాక్కొని అవేదో తమ సొంత ఆస్తిలా జగన్ కుటుంబ సభ్యులు కోర్టుల్లో కొట్టుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమర్శించారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరంలోని సరస్వతి పవర్ ప్లాంట్ భూములను స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సరస్వతి పవర్ ప్లాంట్ కోసం 2007-08లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతుల నుండి 1184 ఎకరాలతోపాటు చుక్కల భూమి 77 ఎకరాలు, అసైన్డ్ భూమి 24 ఎకరాలు తీసుకున్నారని తెలిపారు. సగానికిపైగా భూములు బెదిరించి లాక్కున్నవేనని, 400 ఎకరాల అటవీ భూమిని రెవెన్యూ భూములుగా మార్చి దోచుకున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతామన్నారు. సరస్వతి పవర్ ప్లాంట్ కింద ఎంత భూమి ఉంది, ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగాయనే దానిపై విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల కింద మరో 23.4 ఎకరాలను దోచుకున్నారని విమర్శించారు. ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోగా ఆ భూములను అమ్ముకున్నారని, ప్రశ్నించిన రైతులపై బాంబులు, మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. సిమెంట్ ఫ్యాక్టరీ పేరుతో కృష్ణా నది నుండి 196 కోట్ల లీటర్ల నీరు వాడినట్లు చూపుతున్నారని, లేని ఫ్యాక్టరీకి నీటిని ఎలా ఉపయోగించారని ప్రశ్నించారు. ఈ విషయంపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. సరస్వతి భూముల విషయంలో గతంలో ఈ ప్రాంతంలో రైతులపై అనేక దాడులు జరిగాయని, ఇకపై వారికి ఏ ఇబ్బంది కలిగినా జిల్లా ఎస్‌పిదే బాధ్యతని తెలిపారు.

# పవన్ వ్యాఖ్యలు హోం మంత్రిని అవమానించడమే

## - బాబు పాలనపై వేరే అభిప్రాయానికి దారి తీయవా?

## - ఎంఆర్‌పిఎస్ నేత మంద కృష్ణమాదిగ



అమరావతి: హోంశాఖ విషయంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు హోం మంత్రిని అవమానించడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై వేరే అభిప్రాయానికి ఆస్కారమిచ్చేలా ఉన్నాయని ఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు వచ్చిన ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. హోంశాఖ చూస్తున్న వంగలపూడి అనిత ఒక మాదిగ సామాజిక తరగతికి చెందిన మహిళనే విషయాన్ని పవన్‌కల్యాణ్ గుర్తుపెట్టుకోవాలని ఆయన అన్నారు. పవన్‌కల్యాణ్ విమర్శను తాము మనసులో పెట్టుకుంటామని హెచ్చరించారు. మంచిచెడు విషయాలు ఏమైనా ఉంటే కేబినెట్లో మాట్లాడుకోవాలని అన్నారు. అన్నీ సక్రమంగా ఉండకపోవచ్చని తెలిపారు. ఆ విషయాలను బహిరంగంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. 'మాట్లాడుకోడానికి ముఖ్యమంత్రి ఉన్నారు. కేబినెట్ ఉంది, ఆ వేదికను వదిలిపెట్టి చిన్న పిల్లల మాదిరి మాట్లాడితే ఊరుకునేది లేదు' అని అన్నారు. శాంతిభద్రతలు సిఎం పరిధిలోని అంశమని, ఆ విషయాన్ని బహిరంగంగా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు తర్వాత మందకృష్ణ మాదిగ వచ్చి సిఎంను కలవడం, వెంటనే పవన్‌కల్యాణ్ ప్రకటనను ఖండిస్తూ మీడియా ముందు మాట్లాడడం చకచకా జరిగిపోయాయి. బుధవారం కేబినెట్ సమావేశం ఉన్న నేపథ్యంలో మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి.. పవన్ వ్యాఖ్యలను తాము మనసులో పెట్టుకుంటామని మందకృష్ణ మాదిగ చెప్పడం పరోక్షంగా ఆయనను హెచ్చరించడమేనని పరిశీలకులు పేర్కొంటున్నారు.


# సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో భూ నిర్వాసితులకు నష్ట పరిహారం

## - ఆర్అండ్ఆర్ కార్యాలయం ముందు వ్యకాస ఆందోళన -నెలరోజుల సమయం కోరిన కమిషనర్




అమరావతి: ప్రాజెక్టుల కోసం భూమిని తీసుకున్న ప్రభుత్వం.. వాటిని కోల్పోయిన రైతులకు న్యాయం చేయలేదని, మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీనిచ్చినా పరిష్కారానికి నోచలేదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యసాయి జిల్లాలో బెల్, నాసన్ కంపెనీలు సేకరించిన 800 ఎకరాలకు, అన్నమయ్య జిల్లాలో ముదివేడు రిజర్వాయర్‌కు తీసుకున్న 700 ఎకరాలకు పరిహారం ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మంగళవారం గొల్లపూడిలోని ఆర్అండ్ఆర్ కమిషనర్ కార్యాలయం ముందు వందలాదిమంది ఆందోళన చేపట్టారు. సమస్య పరిష్కరించేవరకూ అక్కడ నుండి కదలబోమని భైఠాయించారు. ఈ సందర్భంగా వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సత్యసాయి జిల్లా బెల్ కంపెనీ, నాసన్ కంపెనీలు మూడు గ్రామాల పరిధిలో 800 ఎకరాలకుపైగా భూమి సేకరించినా ఇప్పటికీ ఆర్అండ్అర్ కింద పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడిగిన ప్రజలపై ఏడు కేసులు పెట్టారని, ఇదెంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ ప్రాంతానికి వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్నికల ముందు మూడు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చినా ఇప్పటి వరకూ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఎవరికీ రూపాయి పరిహారం అందలేదని, పైగా అధికారులు తీవ్ర ఇబ్బందుల పాల్జేస్తున్నారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ముదివేడు రిజర్వాయర్‌కు మూడు గ్రామాల్లో 700 ఎకరాలు తీసుకున్నారని, వారికీ పరిహారం అందలేదని వివరించారు. ఈ ప్రాంతంలో ఎకరాకు పది లక్షల నుండి రూ.15 లక్షల విలువైన టమాటాలు పండుతాయని తెలిపారు. అంత విలువైన భూమిని రైతుల నుంచి తీసుకుని వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. తమకు న్యాయం చేయాలని భూ యజమానులు ఆందోళనలు చేపడితే అధికారులు వేధింపులకు గురిచేశారని అన్నారు. దీంతో సహనం కోల్పోయిన లబ్ధిదారులు తాడోపేడో తేల్చుకునేందుకు కమిషనర్ కార్యాలయం వద్దకు వచ్చారని వివరించారు. సాయంత్రం వరకూ ఆందోన కొనసాగడంతో వారివద్దకు వచ్చిన కమిషనర్ తాను కొత్తగా వచ్చానని, నెలరోజులు సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లి రైతులు వారి సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. దీనిపై నెలరోజుల్లో ప్రభుత్వానికి లిస్టు పంపి న్యాయం చేసేలా చూస్తానని తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే కమిషనర్ కార్యాలయం ముందే నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర నాయకులు శివనాగరాణి, సత్యసాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, పెద్దన్న, అన్నమయ్య జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్చకుల వేతనాలు రూ.15 వేలకు పెంపు - మంత్రి ఆనం



అమరావతి: రాష్ట్రంలో రూ.50 వేలకు పైబడి ఆదాయం వచ్చే ఆలయాల్లో పనిచేసే అర్చకులకు చెల్లించే కనీస వేతనం రూ.15 వేలకు పెంచేందుకు సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేతనాల పెంపు వల్ల 1,683 మంది అర్చకులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కనీస వేతనం రూ.15 వేల కంటే తక్కువ పొందుతున్న అర్చకులకు కొత్త వేతనం కింద రూ.15 వేలు చెల్లించడం ద్వారా దేవాదాయశాఖకు రూ.10 కోట్ల వరకు అదనపు వ్యయం అవుతుందని తెలిపారు. ఇందులో కొంత భాగాన్ని సిజిఎఫ్ నుంచి చెల్లిస్తామని, మొత్తం లబ్ధిపొందే అర్చకులు 3,203 మంది అని మంత్రి పేర్కొన్నారు. దేవాదాయశాఖ 1987 (30 సెక్షన్)లోని 70 సెక్షన్‌ను అనుసరించి అర్చకులకు చెల్లించే కనీస వేతనాన్ని దేవాదాయశాఖ భరిస్తుందన్నారు. ఎన్నికల ప్రణాళికలో బ్రాహ్మణులకు ఇతర వరాలకు, అర్చకులకు, వేద పండితులు, వేదాధ్యయన విద్యార్థులకు ఇచ్చిన నిరుద్యోగ భృతితో సహా ఎన్నికల ప్రణాళికలోని అన్ని అంశాలను అమలు చేసిన ఏకైక శాఖ దేవాదాయశాఖ మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు.

